
## 27

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్



# "హగ్ మి క్విక్!!"

రంజిత్ అనుకున్న సమయానికే ఆ ఇంటికి చేరుకోగలిగాడు. అతనికి అదంతా పరిచయం అయిన స్థలమే కనుక అక్కడికి చేరుకోవడానికి పెద్ద ఇబ్బందేమీ కలగలేదు.

లిఫ్ట్ ఉపయోగించి, సెకండ్ ఫ్లోర్‌కు చేరుకుని ఫ్లాట్ నం.70 దగ్గర ఆగి క్షణం ఆలోచించి కాలింగ్ బెల్‌బటన్ నొక్కాడు రంజిత్.

అది, ఇంట్లో పెద్దగా శబ్దం చేయకుండా పిచ్చుకలు కిచకిచలాడుతున్నట్లుగా కడు శ్రావ్యంగా విన్పించింది. ఆ బెల్ పెట్టుకోవడంలో ఇంటి యజమాని అభిరుచిని అభినందించడమే కాదు, ఆనందించాడు కూడా!

ఇల్లంతా ఎలాంటి చడీ-చప్పుడు లేకుండా అంతా నిశ్శబ్దంగా ఉంది. అసలు ఇంట్లో ఎవరయినా వున్నారో లేదోనని ఓసారి తలుపు వంక చూచాడు. అదృష్టవశాత్తు తలుపు గడియ తీసే ఉంది. తాళం వేసి లేదు. "హమ్మయ్య" అనుకున్నాడు రంజిత్.

ప్రక్క ప్లాట్లు కూడా, ఎవరికి వారే! అన్నట్లుగా అందరి తలుపులు దగ్గరకే వేసి ఉన్నాయి. ఆ ప్రాంతం అంతా కర్ఫ్యూ విధించినట్లుగా ఎలాంటి జనసంచారం లేకుండా, మరీ భయంకరమైన నిశ్శబ్ద వాతావరణం నెలకొని వుంది! ఒక్కోసారి నిశ్శబ్దాన్ని భరించడం కూడా కష్టమే !

అప్పటికి సమయం సాయంకాలం 4.30 కావస్తోంది. బడిపిల్లలు, కాలేజి స్టూడెంట్సు,

ఆఫీసుల నుంచి రావలసిన గృహ యజమానులు, యింకా ఇళ్ళకు చేరకపోవడంతో ఆ వరుస ఫ్లాట్లన్నీ మూగనోము పట్టినట్టుగానే ఉన్నాయి.

రంజిత్ రకరకాల ఆలోచనలతో ఆ ఫ్లాట్ గుమ్మం వైపే చూస్తూ నిలబడ్డాడు. ఈలోగా సన్నని కీచుశబ్దం చేసుకుంటూ తనకు కావలసిన ఇంటి వీధి తలుపులు తెరుచుకున్నాయి. కమ్మని పెరుఫ్యూమ్ సువాసనలతో చల్లని గాలి బయటికి వచ్చింది. ఆ వెనుక ఆమె నవ్వుతూ అందంగా కన్పించింది.

తలుపు పూర్తిగా తెరిచి లోపలికి రమ్మన్నట్టుగా సైగ చేసింది. ఆమె సైగ, ఒకసారి వేయి విసనకర్రలతో విసిరినప్పుడు వచ్చే గాలిలా చల్లగా, హాయిగా అన్పించిందతనికి. తడబడుతున్న అడుగులతో లోపలికి అడుగులు వేశాడు రంజిత్. సోఫాలో కూర్చోమని నవ్వుతూ మరోసారి అందంగా సైగ చేసింది నవ్య.

నవ్య, రంజిత్‌లు ఒకే ఆఫీసులో, ఒకే బాస్ దగ్గర పనిచేస్తున్నారు. ఇద్దరు సంప్రదాయబద్ధంగా పెళ్ళిళ్ళయి పిల్లలున్నవాళ్ళే! రంజిత్ భార్య, నవ్య భర్త కూడా ఉద్యోగస్థులే!

రంజిత్ నవ్య ఇంటికి వచ్చేసరికి, ఆమె భర్త యింకా ఇంటికి చేరుకోలేదు. అతను ఇంటికి వచ్చే సమయం ఫలానా అని కట్టుకున్న భార్యతో సహా ఎవ్వరికి తెలీదు.

ఆరోజు నవ్య ఆఫీసుకు వెళ్ళకపోవడం విశేషమే! ఎందుకంటే సాధారణంగా ఎంతో అర్జంటు అయితే తప్ప ఆఫీసు మానదు. అందుచేతనే ఆమె పనితనానికి, సిన్సియారిటీకి ఆఫీసులో అందరూ తనని అమితంగా ఇష్టపడతారు.

ఒక లేడీ కొలీగ్ తన ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు, ఆ ఇంటికి వెళ్ళడం రంజిత్‌కు ఇదే మొదటిసారి. అలాంటి అవసరం కూడ అతనికి ఎప్పుడూ కలగలేదు. అందుకే, అతను సోఫాలో కూర్చున్నాడే గాని, ఏమాత్రం కంఫర్టబుల్‌గా లేదు! అతని పరిస్థితి ప్రస్తుతం అయోమయంగా ఉంది.

నవ్య తనను ఇలాంటి సమయంలో అసలు ఎందుకు పిలిచిందో అతను ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా అర్థం కావడంలేదు. అవే ఆలోచనలో పడిపోయాడతను.

నవ్య కట్టు, బొట్టు, ఆచార-వ్యవహారాలు, మంచి-మర్యాదలకు రంజిత్ బాగా ఇష్టపడ్డాడు. ఆమె మాటల్లోని ఏదో మాధుర్యం అతనిని కదలకుండా కట్టి పడేస్తుంది. అందుకే ప్రతిదినం ఆఫీసుకు రాగానే ఆమెను పలకరించకుండా అతను వుండలేడు. అతనేకాదు, ఆఫీసులో చాలామంది ఆడ, మగ అనే తేడాలేకుండా ఆమెను ఇష్టపడ్డారు.

రంజిత్‌కు మాత్రం అతని నిత్య దినచర్యల్లో ఇదొక ముఖ్యభాగమయిపోయింది. పొరపాటున ఎప్పుడయినా ఆఫీసుకు నవ్య సెలవు పెడితే, తిరిగి ఆమె ఆఫీసుకు వచ్చేవరకు అతనికి పిచ్చెక్కినట్లవుతుంది.

నవ్యకు కూడా, రంజిత్ అంటే, ప్రత్యేకమైన అభిమానం ఉంది. అతను గౌరవించే విధానం, మాటల్లోని స్నేహభావం, ప్రేమతత్వం, అవసరానికి ఆదుకొని సహాయపడే మనస్తత్వం వంటి లక్షణాలు. అదేవిధంగా తనంటే ఎడతెగని ఆప్యాయతను చూపించడం వంటివి అతని పట్ల ఆమెకు చాలా మంచి అభిప్రాయం ఏర్పడేటట్లు చేశాయి. అందుచేతనే ఏ రోజైనా రంజిత్ కన్పించలేదంటే తను ఏదో కోల్పోయినట్లుగానే ఫీలవుతుంది నవ్య.

వీళ్ళిద్దరి సైకాలజి గురించి ఎవరైనా వింటే, తప్పకుండా వీళ్ళిద్దరికి ఏదో రూపంలో అక్రమ సంబంధం అంటగట్టడం ఖాయం. దేనికి భయపడని నిఖార్సయిన స్నేహం వాళ్ళది!

× × ×

రెండు గాజుగ్లాసుల నిండా ఏదో ఖరీదయిన శీతలపానీయం నింపుకుని, ట్రేలో పెట్టుకుని రంజిత్‌ను సమీపించి అతనిప్రక్క సోఫాలో కూర్చుంది నవ్య.

"ఏమిటి రంజిత్‌గారూ, ఏదో ఆలోచనల్లో పడినట్లున్నారు?" అంటూ పలకరించింది నవ్య.

"అబ్బేం! ఏమీలేదు మేడం!" అన్నాడు కాస్త ఉలిక్కిపడి.

"నా దగ్గర అబద్దాలు కూడానా...! "అంది చిన్నగా నవ్వుతూ. "నిజమే సుమండీ! ఎవరి దగ్గరయినా తప్పించుకోగలనేమోగాని, మీదగ్గర అది సాధ్యం కాదు..."

''అందుకే మరి చెప్పండి. ఏమి ఆలోచిస్తున్నారు?" అంది.

"మీ గురించే...!!" అన్నాడు పొడిగా నవ్వుతూ.

''నా గురించా...?'' అంది నవ్య ఆశ్చర్యపోతూ.

"అవును మేడం, మీ గురించే...! నన్ను ఇక్కడ ఒంటరిగా కూర్చోబెట్టి మీరు లోపల అంత పెద్దపని ఏమి చేస్తున్నారా... అని అన్నాడు రంజిత్.

''ఓ, అదా! మనిద్దరికి కూల్‌డ్రింక్ తెద్దామని..." అంది నవ్య.

"ఏంటి మేడం మీరు యివాళ ఆఫీసుకు రాలేదు! పైగా చాలా డల్‌గా ఉన్నారు. దానికితోడు నన్ను అర్జంటుగా రమ్మన్నారు! కారణం తెలుసుకో వచ్చా?" అన్నాడు కూల్‌డ్రింక్ సిప్ చేస్తూ.

"నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?" అంది అతని వంక ఓరకంట చూస్తూ...

"ఆఁ నాతో అబద్ధం చెప్పే సాహసం చేస్తారా?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును, నిజమే! మీతో అబద్ధం చెప్పడం అంత సులభం కాదు! అబద్ధం చెప్పలేను"అంది నవ్య.

"మరి, అదేదో చెప్పండి. ఏంటి సంగతి?" పూర్తిగా ఆమె మొఖంలోకి చూస్తూ.

"నిజం చెప్పమన్నారుగా, చెబుతున్నాను మరి!" అంది

"చెప్పకుండా అలా వూరించడం ఎందుకు? చెప్పండి!" అన్నాడు.

"మీ గురించే...!! అంది అతని ముఖంలోని హావభావాలు గమనిస్తూ

"నా గురించా..??" అన్నాడు, కించిత్ ఆశ్చర్యానికి లోనవుతూ. రంజిత్ "మేడం, నిజం చెప్పండి. ఎప్పుడయినా నా ప్రవర్తనలోగాని, నా మాటల్లోగాని పొరపాట్లేమయినా దొర్లాయా?'' అన్నాడు హడలిపోతూ.

"మీరెందుకు అలా కంగారుపడ్డారు! అలాంటి పొరపాట్లు ఏమీ జరగలేదు గనకనే మీరు నాకు, నేను మీకు ఇలా స్నేహితులుగా దగ్గరకాగలిగాం.

మనమధ్య అలాంటి అవగాహన, స్నేహభావం, దగ్గరతనం ఉంది కాబట్టి, స్వేచ్ఛగా ఇలా ఇంటికి ఆహ్వానించగలిగాను" అంది నవ్య.

"మరి మీ హబ్బీ ఇప్పుడు వస్తే ఎలా?" అన్నాడు కాస్త ఆందోళనగా. "వస్తే రానివ్వండి, ఆయనకు పరిచయం చేస్తాను ఇందులో పెద్దగా ఆలోచించవలసింది ఏముంది?" అంది

"ఆయన మనస్తత్వం ఎలాంటిదో నాకు తెలియదు కదా! ఆయన తప్పుగా అర్థం చేసుకుని పెడర్థాలు తీస్తే..!!"

"ఊఁ! తప్పుగా అర్థం చేసుకుంటే...?"

"నావల్ల అనవసరంగా మీ ఇద్దరి మధ్య లేనిపోని కలతలు బయలు దేరతాయేమోనని నా భయం!" అన్నాడు.

"ఇప్పుడు కలతలు లేకపోతే కదా... మధ్య పుట్టుకురావడానికి" అంది కాస్త సీరియస్‌గా నవ్య.

"ఆఁ అదేంటి మేడం అలా అంటున్నారు? ఇన్ని రోజుల మన స్నేహంలో నేనెప్పుడు, మీ మనస్సులో రగులుతున్న అశాంతిని కొంచెమయినా పసిగట్టలేకపోయాను!" అన్నాడు కాస్త నీరసంగా

రంజిత్.

అవును రంజిత్ ఆ గొప్పతనం నాదే! అంతర్గతంగా నాలో ఎన్ని అగ్నిగోళాలు బద్ధలవుతున్నా వాటిని బలవంతంగా నాలో నేనే అణచుకొని, మీ అందరి ముందు ఒక 'మైమ్'- కళాకారిణిగా నటిస్తున్నానంతే!" అంది కాస్త బాధగా తిరిగి తనే కల్పించుకొని,

"నిజానికి అతను ఎంత మంచివాడో, అంత చెడ్డవాడు కూడా! నవీన్ మనస్సు అర్థంకాని ఒక జడపదార్థం. అతను ఎప్పుడు ఎలా మారతాడో ఎలా, ప్రవర్తిస్తాడో, ఏమి మాట్లాడతాడో నాకే కాదు, అతనికీ తెలీదు. ఎంత చెప్పినా రోజూ డ్రింక్‌చేసి ఆలస్యంగా ఇంటికి వస్తాడు. ఇంట్లో ఎదుగుతున్న ఆడపిల్ల ఉందన్న ఇంగితజ్ఞానం అతనికిలేదు. డిన్నర్ చేస్తే చేస్తాడు లేకపోతే లేదు. మాట-పలుకులేకుండా పడక మంచంమీద ఒక మృగంలా ప్రవర్తిస్తాడు. సిగ్గువిడిచి ఇలా ఎన్నని చెప్పి మీ మనస్సు పాడు చెయ్యమంటారు?" అంది.

"నవ్య మేడం, మీలో మీరు ఇంత వ్యధను అనుభవిస్తున్నారా? ఇంతకుమించిన నరకం మరేముంటుంది! పైగా మీ యిద్దరి మధ్య అనవసరంగా మీపావ...!!" అంటూ ఏదో చెప్పబోయాడు రంజిత్.

"అవును రంజిత్, మా ఇద్దరి మధ్య అది నలిగిపోతోంది. చివరికి నా స్వప్న ఎలా తయారవుతుందోనన్న బాధ, భయం, ఒక ప్రక్క నన్ను రాచపుండులా నన్ను తొలిచేస్తూనే ఉంది. కాని ఏం లాభం? అతను అర్థం చేసుకోడు కదా!" అంది బాధగా.

"నాకంతా అయోమయంగా ఉంది మేడం! నవీన్‌గారితో నన్ను మాట్లాడమంటారా? ఇంతకాలం మీ ఇద్దరిది అన్యోన్యమైన ఆదర్శజంట అనుకున్నాను.

మీది ప్రేమ వివాహం అని కూడా నాకు తెలుసు! మీ ఇద్దరి మధ్య యితరులకు అందనంత అనురాగం, ఆప్యాయత, ప్రేమ పెనవేసుకొని ఉన్నాయని ఈర్ష్యపడ్డాను" అన్నాడు, తథేకంగా నవ్యను గమనిస్తూ.

"అలాంటి పొరపాటు పని చేయకండి రంజిత్. దీనివల్ల ఎదురయ్యే ప్రమాదకరమైన సమస్యలు మీకు అర్థంకావు. తరువాత మీలాంటి వారి స్నేహం కూడా కోల్పోతే నేను పిచ్చిదాన్నవుతాను, యిది మాత్రం ఖాయం.

సిగ్గు విడిచి చెబుతున్నాను వినండి. అతను నేను కేవలం అపరిచితుల్లా బ్రతుకుతున్నాం తెలుసా! బయటివారి కోసం ఒక అన్యోన్యమైన జంటగా గొప్పగా నటిస్తున్నాం" అంది తడికళ్ళకు సున్నితంగా చీర కొంగుతో అద్దుకుంటూ.

నవ్య కళ్ళల్లో తడి గమనించిన రంజిత్‌కి ఆ క్షణంలో ఏం చేయాలో, నవ్యను ఎలా ఓదార్చాలో తెలిసింది కాదు. క్షణం మొద్దుబారిన అతని మెదడును తక్షణం తన స్వాధీనంలోనికి తెచ్చుకుని,

"ప్లీజ్ మేడం ఏడ్వకండి...!" అనగలిగాడు. పొంగి పొర్లివస్తున్న దుఃఖాన్ని దిగమింగుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ, చీరకొంగుతో కళ్ళను పదేపదే వత్తుకుంటూ...

"సారీ, రంజిత్‌గారు! ఇంటికి పిలిచి నా సోదంతా చెప్పి అనవసరంగా మిమ్మల్ని యిబ్బందుల్లో పడేశాను. నాలో రగులుతున్న బాధని, వ్యధని మీముందు ప్రదర్శించబోయాను. మీలాంటి అర్థం చేసుకోగల మంచి మనస్సుగల వ్యక్తుల ముందు హృదయం విప్పి చెప్పుకోగలిగితే, కాస్త తేలికగా ఉపశమనం లభిస్తుందంటారు కదా! నాకు తెలీకుండానే ఆ పని నేను చేసేశాను. నిజానికి నా సంసార సమస్యలను ఏకరువు పెట్టడానికి కాదు మిమ్మల్ని ఇంటికి ఆహ్వానించింది!" అంది నెమ్మదిగా.

"అలాగా! చెప్పండి మేడం, నానుండి మీకు ఎలాంటి సహాయం కావాలన్నా యీ రంజిత్ ఎప్పుడూ సిద్ధమే! సందేహించకండి" అన్నాడు ఆత్రంగా.

"ఆ అవసరం వచ్చినప్పుడు తప్పకుండా చెబుతాను. ప్రస్తుతం పూర్తిగా నన్ను అర్థం చేసుకునేవాళ్ళు మీరు తప్ప మరెవ్వరూ నాకు యిక్కడ లేరు" అంది నవ్య.

ఏదో గుర్తుకు వచ్చినదానిలా హఠాత్తుగా నవ్య లేవబోయి తూలి పడిపోబోయింది. అదే క్షణంలో అనుకోకుండా రంజిత్ లేవబోయి, తూలి పడిపోబోతున్న ఆమెను గట్టిగా పట్టుకున్నాడు. కొద్ది నిమిషాల్లోనే తేరుకొని, అతనికి మరింత దగ్గరగా చేరుకొని, రంజిత్ హృదయంపై వాలిపోయింది.

క్షణాల్లో జరిగిన యీ హఠాత్పరిణామానికి అతను కొయ్యబారిపోయాడు. ఆమె గుండె వేగం అతను గ్రహించగలిగాడు. ఆమె శరీర స్పర్శతో అతను కాలిపోతాడేమోనన్నంత వేడిమి ఆమెలో ప్రవహించడం అతనికి అర్థమయింది.

మరుక్షణంలో అతనికి దూరంగా జరిగి "సారీ అంటే ఎందుచేతనో కళ్ళుతిరిగి తూలిపడిపోబోయాను. ఆ క్షణంలో మీరే లేకుంటే నా తల బ్రద్దలయ్యేవేమో" అంది.

అతను ఏమీ మాట్లాడలేక ఆమెవంక చూస్తూ ఉండిపోయాడు.

× × ×

'మమ్మీ! మమ్మీ!! ఏమిటా కలవరింతలు! నిద్రలో ఎవరితో అలా గట్టిగా మాట్లాడుతున్నావ్? ఇప్పుడు టైం ఎంతయిందో తెలుసా! తెల్లగా తెల్లారిపోయింది తెలుసా! అసలే ఈరోజు త్వరగా లేచి మేమంతా పిక్నిక్‌కి వెళ్ళాలనుకున్నాం కదా!" అంటూ తల్లి భుజాలు పట్టి కుదిపి లేపసాగింది స్వప్న.

తను యింతవరకు నిజ జీవితంలో జీవిస్తున్నట్లుగానే ఫీల్ అయింది. అప్పటికిగాని తెలిసిరాలేదు. తను కలగంటున్న విషయం నవ్యకి.

"నాన్నా! ఓసారి ఇలారా?" అని కూతురుని దగ్గరగా పిలిచి గాఢంగా హృదయానికి హత్తుకుంది నవ్య. తల్లి వింతచేష్టలు స్వప్నకు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

అప్పటికే తెల్లవారి ఆరుగంటలు దాటడంతో, లేచి హడావిడిగా వంటగది వైపు నడిచింది నవ్య.

ప్రక్కగది-తన బెడ్‌రూమ్‌లో గురకపెట్టి నిద్రపోతున్నాడు నవీన్.



**190 పేజీలతో**
ప్రముఖ రచయితలతో,
చినుకు మూడవ వార్షిక ప్రత్యేక సంచిక
వెల రు.35/- (పోస్టేజితో సహా).
కావలసినవారు ఎం.ఓ. ద్వారా 'చినుకు'
కార్యాలయానికి పంపించగలరు.
**చినుకు మాసపత్రిక,** దత్తాస్ నయాబజార్,
రాజ్ యువరాజ్ థియేటర్స్ ఎదురుగా,
గాంధీనగర్, విజయవాడ - 520 003.
Phone: **0866-6640595,** E-mail : editor_chinuku@yahoo.com